

# నిజం
దృష్టి తెలుగు న్యూస్

TG/TEL/25/A3731

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ ఎడిటర్: వరుదు సుజాత సంపుటి:-1 సంచిక:-216 పేజీలు:-4 ఆదివారం 19-07-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## భారత అంతరిక్ష చరిత్రలో నవశకం

తొలి ప్రైవేట్ రాకెట్ 'విక్రమ్-1' ప్రయోగం సక్సెస్

- స్కైరూట్ ఏరోస్పేస్ 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం
- భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్‌గా రికార్డు సృష్టి
- శ్రీహరికోట నుంచి నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్
- 'ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం చారిత్రాత్మకం
- ప్రధాని సందేశంతో పాటు పలు పేలోడ్లను కక్ష్యలోకి మోసుకెళ్లిన 'విక్రమ్-1'



భారత అంతరిక్ష రంగంలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. దేశీయ ప్రైవేట్ స్పేస్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్, పూర్తిగా స్వదేశీ - మిగతా 2 లో

## 500 మందికి పైగా రోహింగ్యాలతో రెండు పడవలు అదృశ్యం

సముద్రంలో కొట్టుకొస్తున్న శవాలు!

- బంగాళాఖాతంలో రెండు శరణార్థుల పడవలు అదృశ్యం
- 500 మందికి పైగా జలసమాధి అయినట్లు అనుమానాలు
- మయన్మార్, బంగ్లాదేశ్ తీరాలకు కొట్టుకొస్తున్న మృతదేహాలు
- భీకర రుతుపవన గాలులు, వర్షాల వల్లే ప్రమాదం
- మయన్మార్ అంతర్యుద్ధం, ఆకలి తట్టుకోలేకే సాహస ప్రయాణాలు



మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రం నుండి సుమారు 530 మంది రోహింగ్యా శరణార్థులతో బయలుదేరిన రెండు పడవలు సముద్రంలో అదృశ్యమయ్యాయి. ఈ ప్రమాదంలో 500 మందికి పైగా శరణార్థులు జలసమాధి అయి - మిగతా 2 లో

## టీ-హబ్ బేబీ 'స్కైరూట్' చరిత్ర సృష్టించింది



- శ్రీహరికోట నుంచి రాకెట్ ను విజయవంతంగా ప్రయోగించిన స్కైరూట్
- టీహబ్ నుంచే స్కైరూట్ పురుడు పోసుకుందన్న కేటీఆర్
- ఆ సంస్థ ఇప్పుడు గ్లోబల్ స్థాయికి ఎదగడం అందరికి స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య

హైదరాబాద్ సరూర్ నగర్ వేదికగా జరిగిన 'యువ సంగ్రామ సదస్సు'లో - మిగతా 2 లో

## రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం



- ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందిస్తామన్న కోమటిరెడ్డి
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని వ్యాఖ్య
- పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్న మంత్రి

తెలంగాణ రాష్ట్రంలో గుడిసెలు అనేవే లేకుండా చేస్తామని, అర్హులైన ప్రతి నిరుపేద - మిగతా 2 లో

# కేసీఆర్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు

- కేసీఆర్ కుటుంబీకులు నిజాం రాజును మించిన ధనవంతులుగా మారారు: రేవంత్ రెడ్డి
- ఘట్‌కేసర్‌లో అందెశ్రీ స్మృతివనానికి భూమిపూజ
- అందెశ్రీ ఒక ఆత్మబంధువు అని కొనియాడిన సీఎం రేవంత్ రెడ్డి
- ఏడాదిలోనే 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని వెల్లడి
- తాను సీఎంగా ఉండగా బీఆర్ఎస్ అధికారంలోకి రాదని స్పష్టం




కేసీఆర్ కుటుంబం వందలాది ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించుకుందని, వారు నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎదిగారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రముఖ కవి, గాయకుడు, తెలంగాణ ఉద్యమ

# 'భారత్‌ను గర్వపడేలా చేశారు'

- విక్రమ్-1 సక్సెస్ తర్వాత స్కైరూట్‌కు మోదీ ఫోన్!
- విక్రమ్-1 విజయంపై స్కైరూట్‌కు మోదీ ఫోన్
- 'భారత్‌ను గర్వపడేలా చేశారు' అంటూ ప్రశంస
- యువతపై తన నమ్మకం నిజమైందన్న ప్రధాని
- స్కైరూట్ టీమ్ సగటు వయసు 28 ఏళ్లని పవన్ వెల్లడి
- విక్రమ్-1తో అంతరిక్షంలోకి మోదీ రాసిన 'వందేమాతరం' సందేశం





భారత తొలి ప్రైవేట్ రాకెట్ విక్రమ్-1 ప్రయోగం విజయవంతమైన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ స్కైరూట్ బృందానికి ఫోన్ చేసి అభినందించారు. సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో సంబరాలు

## 'బుల్లెట్ ట్రైన్'పై లడాయి

భారత్‌పై జపాన్ మాజీ మంత్రి సంచలన ఆరోపణలు!



- భారత అధికారుల వల్లే బుల్లెట్ ట్రైన్ ఆలస్యమన్న హిడెకి మాకిహారా
- జపాన్ మాజీ మంత్రి ఆరోపణలను ఖండించిన భారత విదేశాంగ శాఖ
- సిగ్నలింగ్ వ్యవస్థపై కాంగ్రెస్ విమర్శలను కొట్టిపారేసిన కేంద్రం
- సరికొత్త ఈ10 సిరీస్ రైళ్లు 2030 తర్వాతే రానున్నట్లు వెల్లడి
- 2027 ఆగస్టు 15 నాటికి తొలి విడత బుల్లెట్ రైలు ప్రారంభం!

దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా సాగుతున్న ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు చుట్టూ - మిగతా 2 లో

## 'నా అనుమతి లేకుండా చికిత్స వద్దు'

సోనమ్ వాంగ్‌చుక్ భార్య విజ్ఞప్తి



- కుటుంబ సమ్మతి, వైద్యుల అంగీకారం లేకుండా వైద్యం వద్దన్న గీతాంజలి
- ఆరోగ్యం క్షీణించడంతో ఆయన్ను ఆసుపత్రికి తరలించిన పోలీసులు
- హైకోర్టు ఆదేశాలతో చర్యలు తీసుకున్నామన్న పోలీసులు
- అడ్డుకున్న నిరసనకారులతో స్వల్ప ఉద్రిక్తత

తన అనుమతి, కుటుంబ సభ్యుల సమ్మతి లేకుండా సోనమ్ వాంగ్‌చుక్‌కు ఎలాంటి చికిత్స - మిగతా 2 లో

## మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ



- గుంటూరులో మహిళపై టీడీపీ నేత దాడి ఘటనపై జగన్ ఆగ్రహం
- బుధవారం ఘటన జరిగితే మూడు రోజులు కప్పిపుచ్చారని ఆరోపణ
- ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదని తీవ్ర విమర్శలు
- ఇదేనా సుపరిపాలన, మహిళా భద్రత అంటూ సర్కారుకు ప్రశ్నలు
- మహిళల ఆగ్రహం ప్రభుత్వానికి బుద్ధి చెబుతుందని హెచ్చరిక

గుంటూరులో ఒక మహిళను వివస్త్రను చేసి, టీడీపీ నాయకుడు దాడికి పాల్పడిన ఘటన - మిగతా 2 లో

## మోదీ దార్శనికతకు, భారతీయ ప్రతిభకు ప్రతీక

విక్రమ్-1 రాకెట్ విజయంపై పవన్ కల్యాణ్



- తొలి ప్రయత్నంలోనే ఘన విజయం సాధించిన స్కైరూట్
- విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్
- సరికొత్త ఆవిష్కరణల్లో ప్రపంచ దేశాల సరసన భారత్ నిలుస్తుందన్న పవన్

భారత అంతరిక్ష పరిశోధన రంగంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ.. దేశంలోనే తొలిసారిగా ఒక ప్రైవేట్ ఏరోస్పేస్ సంస్థ 'స్కైరూట్' రూపొందించిన 'విక్రమ్-1' రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. - మిగతా 2 లో

# 2024లో రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారు

- రాష్ట్రవ్యాప్తంగా రూ.15,274 కోట్ల పట్టణాభివృద్ధి పనులకు గుడివాడ నుంచి శ్రీకారం
- బూతులు తిట్టిన వారి నోళ్లను ప్రజలు తమ ఓట్లతో కడిగేశారన్న చంద్రబాబు
- అక్టోబర్ 2 నాటికి ఏపీని చెత్త రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటన
- భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో అసభ్య పోస్టులను సహించేది లేదని హెచ్చరిక
- ఈ నెల 22 నుంచి "తల్లికి వందనం" కింద తల్లుల ఖాతాల్లో నిధులు జమ




పరిశుభ్రమైన, సంపన్నమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు

## మోదీ దార్శనికతకు, భారతీయ ప్రతిభకు ప్రతీక

మొదటిపేజీ తరువాయి - శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి 'మిషన్ ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ చరిత్రాత్మక ప్రయోగం విజయవంతం కావడం పట్ల ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ అద్భుత విజయాన్ని సాధించిన శాస్త్రవేత్తలకు, స్టార్టప్ బృందానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంతరిక్ష సాంకేతికత, సరికొత్త ఆవిష్కరణల్లో ప్రపంచ దేశాల సరసన భారతదేశాన్ని అగ్రగామిగా నిలపడానికి ఈ ప్రయోగం ఒక చక్కటి నిదర్శనమని పవన్ కల్యాణ్ కొనియాడారు. ఈ విజయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టమైన దార్శనికతకు, ఆయన అందిస్తున్న ప్రోత్సాహానికి దక్కిన ప్రతిఫలమని అభిప్రాయపడ్డారు. స్పేస్ రీసెర్చ్ రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ఆహ్వానించడం ద్వారా దేశంలో సరికొత్త స్టార్టప్‌ల అభివృద్ధికి, యువతలో వ్యవస్థాపక స్ఫూర్తిని రగిలించడానికి కొత్త అవకాశాలు వచ్చాయన్నారు. పట్టుదల, వినూత్న ఆలోచనలు ఉంటే ప్రైవేట్ రంగంలోనూ అద్భుతాలు సృష్టించవచ్చని ఈ ప్రయోగం నిరూపించిందని, ఇది ప్రతి యువ భారతీయుడికి ఒక బలమైన సందేశాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రయోగాన్ని విజయవంతం చేయడంలో ప్రైవేట్ రంగానికి వెన్నుదన్నుగా నిలిచిన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) పాత్రను పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. శాస్త్రీయ నైపుణ్యాన్ని అందిస్తూ యువతను ప్రోత్సహించడంలో ఇస్రో ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. ఈ అద్భుత రాకెట్‌ను తయారు చేసిన 'స్కైరూట్ ఏరోస్పేస్' బృందంతో పాటు ఇస్రో, ఇన్-స్పేస్ (×చీ-ూూూజవ) సంస్థల శాస్త్రవేత్తలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ విజయగాథ రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలిచి, అంతరిక్ష రంగంలో భారతదేశాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## టీ-హబ్ బేబీ 'స్కైరూట్' చరిత్ర సృష్టించింది

మొదటిపేజీ తరువాయి - బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇవాళ నమోదైన కీలక అంతరిక్ష విజయాన్ని పంచుకున్నారు. దేశంలోనే తొలిసారిగా శ్రీహరికోట నుంచి ప్రైవేట్ రాకెట్ 'విక్రమ్-1' విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ అద్భుత రికార్డు సృష్టించిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ మరెక్కడో కాదు.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'టీ-హబ్' వేదికగానే పురుడు పోసుకుందని గర్వంగా ప్రకటించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు పూర్తయిన తరుణంలో... దేశ చరిత్రలోనే సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ ఒక ప్రైవేట్ రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపిన ఘనత స్కైరూట్ కంపెనీకే దక్కుతుందని కేటీఆర్ కొనియాడారు. మన హైదరాబాద్‌లోని టీ-హబ్ వేదికగా స్టార్టప్‌గా ప్రస్థానం మొదలుపెట్టిన ఒక సంస్థ, ఇవాళ ప్రపంచ స్థాయిలో దేశం గర్వించేలా ఎదగడం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. శ్రీహరికోట సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ప్రయోగం అత్యంత విజయవంతంగా ముగిసిందని కేటీఆర్ తెలిపారు. ఈ చరిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించిన స్కైరూట్ టీమ్‌కు సభకు హాజరైన నిరుద్యోగ యువత, విద్యార్థులంతా చప్పట్లతో ఘనంగా అభినందనలు తెలపాలని అన్నారు. మరోవైపు, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో సహకారంతో ప్రైవేట్ రంగానికి చెందిన తొలి దేశీయ రాకెట్ ప్రయోగం సక్సెస్ కావడంతో... అటు ఇస్రో సైంటిస్టులతో పాటు ఇటు స్కైరూట్ కంట్రోల్ సెంటర్‌లోనూ పండుగ వాతావరణం నెలకొంది.

## రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం

మొదటిపేజీ తరువాయి - కుటుంబానికి సొంత పక్కా ఇల్లు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని ఆయన కొనియాడారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో రూ.184.15 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పరిగి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు కీలక వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని పేద ప్రజలు సొంతంగా పక్కా ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని కోమటిరెడ్డి తెలిపారు. త్వరలోనే అర్హులైన మిగతా వారందరికీ ఇళ్లు ఇచ్చేందుకు రెండో విడత కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. వికారాబాద్ జిల్లాలో రోడ్ల నెట్‌వర్క్ బలోపేతం కోసం రూ.900 కోట్ల నిధులు మంజూరు చేయించామని, అందులో నుంచే పరిగి నియోజకవర్గానికి రూ.184.15 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రవాణా వ్యవస్థ మెరుగైతేనే పరిశ్రమలు వచ్చి స్థానిక యువతకు ఉపాధి పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి తీరుతామని మాట ఇచ్చిన మంత్రి కోమటిరెడ్డి... నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులతో పాటు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నామని వివరించారు.

## కేసీఆర్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు

మొదటిపేజీ తరువాయి - నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎదిగారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రముఖ కవి, గాయకుడు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిదాత అందెశ్రీ గౌరవార్థం ఘట్‌కేసర్‌లో నిర్మించనున్న 'అందెశ్రీ స్మృతివనం' పనులకు ముఖ్యమంత్రి శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "దొరల గడీల ముందు తలవంచను" అని చాటిచెప్పిన ధైర్యశాలి అందెశ్రీ అని ముఖ్యమంత్రి కొనియాడారు. ప్రజల కవిగా, గాయకుడిగా అందెశ్రీ అందించిన సేవలను స్మరించుకుంటూ, ఆయనను తన 'ఆత్మబంధువు'గా అభివర్ణించారు. గత పాలకులు ఆయన వంటి గొప్ప కళాకారులను విస్మరించారని మండిపడ్డారు. ఇదే క్రమంలో, కల్వకుంట్ల కుటుంబంపై రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతను పట్టించుకోకపోవడంతో వారు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఏళ్ల తరబడి గ్రూప్-1 వంటి పరీక్షలు కూడా నిర్వహించలేదని రేవంత్ రెడ్డి ఆరోపించారు. అందుకు భిన్నంగా, తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే సుమారు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, అభ్యర్థుల తల్లిదండ్రుల సమక్షంలోనే నియామక పత్రాలను అందజేస్తున్నామని తెలిపారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌ల నిర్మాణం కోసం కేసీఆర్ కుటుంబం తెలంగాణ సంపదను దోచుకుందని, మళ్లీ ఎవరైనా అటువంటి ప్రయత్నం చేస్తే ఎదిరించడానికి అందెశ్రీ పాట రూపంలో పుడతాడని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందెశ్రీని తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని దుయ్యబట్టారు. ప్రజాకవి గద్దర్‌ను సైతం ప్రజాభవన్ గేటు వద్ద ఎర్రటి ఎండలో నిలబెట్టి అవమానించారని మండిపడ్డారు. వారిద్దరిని అవమానించినప్పుడే దొరల పాలనకు చరమగీతం పాడాలని తెలంగాణ ప్రజలు నిర్ణయించుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## 'భారత్‌ను గర్వపడేలా చేశారు'



మొదటిపేజీ తరువాయి - జరుగుతున్న సమయంలో వచ్చిన ఈ కాల్‌లో యువ శాస్త్రవేత్తల కృషిని ప్రధాని ప్రశంసించారు. స్కైరూట్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు పవన్ కుమార్‌తో మాట్లాడిన మోదీ.. "మీరు భారత్‌ను గర్వపడేలా చేశారు. భారత ఆశయాలను అంతరిక్షంలో నిలబెట్టారు. యువత కలలకు బలమైన పునాది వేశారు" అని అన్నారు. భారత యువతపై తనకున్న నమ్మకాన్ని ఈ బృందం నిజం చేసిందని కొనియాడారు. దీనికి పవన్ స్పందిస్తూ.. తమ బృందం సగటు వయసు కేవలం 28 ఏళ్లు మాత్రమేనని చెప్పారు. దీనిపై మోదీ మాట్లాడుతూ.. భారత యువతను నమ్మితే అద్భుతాలు చేయగలరని ఈ విజయం మరోసారి నిరూపించిందన్నారు. ఈ చారిత్రక క్షణంలో తాను కూడా భాగం కావాలనే ఉద్దేశంతోనే ఫోన్ చేసినట్లు చెప్పారు. 'ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ మిషన్ స్కైరూట్ ప్రయాణానికి ఆరంభం మాత్రమేనని, ముందు ఇంకా ఎన్నో విజయాలు సాధించాలని మోదీ ఆకాంక్షించారు. ఈ తొమ్మిది నిమిషాల సంభాషణలో భారత అంతరిక్ష రంగాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లినందుకు బృందాన్ని అభినందించారు. ప్రయోగానికి ముందు ప్రధాని చేతిరాతలో పంపిన 'వందేమాతరం' సందేశాన్ని విక్రమ్-1తో పాటు అంతరిక్షంలోకి తీసుకెళ్లినట్లు పవన్ తెలిపారు. దీనిపై స్పందించిన మోదీ.. జాతీయ గీతానికి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, యువతకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలిచే సందేశం కావడంతోనే ఆ పదాలను రాశానన్నారు. చివరగా "ముందుకు సాగండి... మరింత ఎత్తుకు ఎగరండి... నేను మీ వెంటే ఉంటాను" అంటూ స్కైరూట్ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

## మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ

మొదటిపేజీ తరువాయి - మానవత్వానికే మచ్చ అని, రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణ ఎంత ఘోరంగా విఫలమైందో చెప్పడానికి ఇది నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. ఈ దారుణానికి చంద్రబాబు ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని ఆయన విమర్శించారు. ఈ ఘటన బుధవారమే జరిగినా, మూడు రోజులపాటు దానిని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని, చివరకు ఆ వీడియోలు సోషల్ మీడియాలో బయటకు వచ్చి రాష్ట్ర ప్రజలంతా ఈ పరిపాలనను అసహ్యించుకున్న తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పుడు తానేదో గొప్పగా చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు హడావుడి చేయడం మరింత సిగ్గుచేటని అన్నారు. ఆ వీడియోలను కప్పిపుచ్చడంపై చూపిన శ్రద్ధను నిందితులను పట్టుకోవడంపై చూపలేదని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తనపై తొలిసారి దాడి జరిగిన వెంటనే బాధితురాలు పోలీసులను ఆశ్రయించినప్పుడు వారు స్పందించి ఉంటే, ఆ తర్వాత ఇంతటి ఘోరం జరిగేది కాదు కదా అని ప్రశ్నించారు. ఆమె ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని ఉంటే ఈ దారుణం జరిగేదా? అని నిలదీశారు. ఫిర్యాదు చేసిన మహిళకు రక్షణ కల్పించకుండా మౌనం వహించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. "అసలు పోలీస్ స్టేషన్లు ఉన్నది ఎందుకు? బాధితుల ఫిర్యాదులను స్వీకరించడానికా? లేక అధికార పార్టీ నాయకులు ఏం చెబితే అది చేయడానికా? బాధితురాలికి అండగా నిలవకపోగా, పంచాయితీలు చేయడానికి ప్రయత్నిస్తారా? వీడియోలు బయటకు వస్తేనే చట్టం మేల్కొంటుందా? బాధితురాలి ఫిర్యాదుకు విలువ లేదా? నేరం జరుగుతున్నప్పుడు స్పందించకుండా, ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికిన తర్వాత చర్యల పేరుతో నాటకాలు ఆడటం ఏ రకమైన పోలీసింగ్ రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఈ చంద్రబాబు ప్రభుత్వం కావాలనే దాడులను ప్రోత్సహించింది. ఆ అరాచకాలను కప్పిపుచ్చడానికి పోలీసు వ్యవస్థను ఒక రాజకీయ ఆయుధంగా మార్చుకుంది. చట్టాన్ని అధికార పార్టీకి చుట్టంగా, ప్రతిపక్షాలపై వేధింపులకు, అక్రమ కేసులకు ఒక సాధనంగా మార్చి రాష్ట్రాన్ని జంగిల్‌రాజ్‌గా దిగజార్చింది" అని ఆయన తీవ్రంగా విమర్శించారు. అధికార పార్టీ నాయకులు ఏం చేసినా పోలీసులు రక్షిస్తారనే ధైర్యం ఈ రెడ్‌బుక్‌పాలనలో గ్రామాలు, వార్డుల స్థాయి వరకూ పాకిందని జగన్ అన్నారు. అందుకే టీడీపీ కూటమికి చెందిన పలువురు నాయకులు దుశ్శాసనుల్లా తయారయ్యారని మండిపడ్డారు. ఎలాంటి దారుణాలు చేసినా, ముఖ్యంగా మహిళలపై దాడి చేసినా, తమను కాపాడటానికి చంద్రబాబు ఉన్నారనే ధైర్యం వారిలో పెరిగిపోయిందని ధ్వజమెత్తారు.

ఈ పరిస్థితి రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా చేసిందని జగన్ ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల దురాగతాల నుంచి తమను తాము కాపాడుకోవాల్సిన దుస్థితికి మహిళలు చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "చంద్రబాబు గారూ, ఇదేనా మీరు చెప్పే మహిళా భద్రత? ఇదేనా మీ సుపరిపాలన? ఇదేనా మీ పోలీసింగ్? మహిళల ఆగ్రహమే మీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతుంది" అని ఆయన హెచ్చరించారు.

## 2024లో రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారు

మొదటిపేజీ తరువాయి - అన్నారు. బూతులు తిట్టిన వారి నోళ్లను ప్రజలు తమ ఓట్లతో కడిగేశారని ఘాటుగా వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లా గుడివాడలో శనివారం జరిగిన 18వ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 120 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో రూ.15,274 కోట్ల విలువైన ప్రజారోగ్య, మున్సిపల్ ఇంజినీరింగ్ పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అక్టోబర్ 2వ తేదీ నాటికి రాష్ట్రాన్ని కాలుష్య రహిత, చెత్త రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

### స్వచ్ఛ రాజకీయాల కోసమే ఎన్టీఆర్ పార్టీ స్థాపన

దివంగత ఎన్టీఆర్ తొలిసారి ప్రజాక్షేత్రంలో నిలిచిన గుడివాడ నుంచే స్వచ్ఛ రాజకీయాలకు పునాది పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. స్వచ్ఛమైన రాజకీయాలు, స్వచ్ఛమైన ప్రజాప్రతినిధులు, తెలుగువారి ఆత్మగౌరవం అనే లక్ష్యాలతోనే ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని తెలిపారు. గతంలో ఉన్న స్వార్థ రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధి, సంక్షేమానికి ఆయన శ్రీకారం చుట్టారని అన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి, సంపద సృష్టి లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. పరిశుభ్రత అంటే కేవలం రోడ్లు ఊడ్చడం కాదని, పర్యావరణాన్ని, ప్రజారోగ్యాన్ని కాపాడటమే అసలు లక్ష్యమని వివరించారు.

### అక్టోబర్ 2 నాటికి చెత్త రహిత రాష్ట్రం

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 140 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని, దానిని తొలగించి ఇప్పుడు స్వచ్ఛ పథం, ఆపరేషన్ క్లీన్ స్వీప్ వంటి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని శుభ్రం చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. అక్టోబర్ 2 నాటికి రాష్ట్రాన్ని చెత్త రహితంగా మారుస్తామని ప్రకటించారు. దీనికోసం రూ.528 కోట్లతో వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు, చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే 8 ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇంటింటికీ చెత్త సేకరణ కోసం 126 ఎలక్ట్రిక్ ఆటోలను ప్రారంభించామని, త్వరలో మరో 1104 ఇ-ఆటోలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుంచే తడి, పొడి చెత్తను వేరుచేయాలని, 'నెట్ జీరో' వ్యర్థాల విధానాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

### తప్పు ఎవరు చేసినా ఉపేక్షించం

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, ప్రజలు సంతోషంగా జీవించే పరిస్థితి లేకపోయిందని చంద్రబాబు విమర్శించారు. రాజకీయాల్లో క్రిమినల్ ధోరణులు, కుట్రలు, సోషల్ మీడియాలో అసభ్య పోస్టులతో ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్య పోస్టులు పెట్టి, ప్రశ్నిస్తే భావ ప్రకటనా స్వేచ్ఛ అనడం దారుణమన్నారు. ప్రజల జీవితాలకు ఆటంకం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవడానికి వీల్లేదని, తప్పు చేసిన వ్యక్తి ఏ పార్టీకి చెందిన వారైనా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గుంటూరులో మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించిన టీడీపీ కార్యకర్తను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేసి అరెస్ట్ చేయించామని, శ్రీకాకుళం ఘటనలోనూ బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు.

### సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వం వద్ద డబ్బు లేకపోయినా, పేదల పక్షాన నిలిచే మనసుందని అన్నారు. ఈ నెల 22 నుంచి 24 మధ్య "తల్లికి వందనం" పథకం కింద 67.47 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10,122 కోట్లు జమ చేయనున్నట్లు ప్రకటించారు. మరోవైపు, 12 ఏళ్ల క్రితం నీళ్లు లేక ఇబ్బంది పడిన కృష్ణా డెల్టాకు పట్టిసీమ ద్వారా 450 టీఎంసీల గోదావరి జలాలను అందించి రూ.50 వేల కోట్ల సంపద సృష్టించామని గుర్తుచేశారు. అక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తూ ఆదుకుంటున్నామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుడివాడ బస్టాండ్ అభివృద్ధికి అన్నే నరసింహారావు దంపతులు రూ.3 కోట్లు విరాళం ప్రకటించారు. సాయి శ్వేత అనే గృహిణి అమరావతి కోసం తన బంగారు గాజులను విరాళంగా ఇచ్చారు. వారిని ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఎంపీ బాలశౌరి, స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

## భారత అంతరిక్ష చరిత్రలో నవశకం..

మొదటిపేజీ తరువాయి - తొలి ప్రైవేట్ రాకెట్ 'విక్రమ్-1' ప్రయోగం సక్సెస్

పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'విక్రమ్-1' ఆర్బిటాల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో వాణిజ్యపరంగా సొంతంగా ఆర్బిటాల్ రాకెట్లను అభివృద్ధి చేసి, ప్రయోగించిన అతికొన్ని దేశాల సరసన భారత్ నిలిచింది. 'మిషన్ ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం భారత ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ రాకను సూచిస్తుంది. తొలుత ఒక అంతర్గత సాంకేతిక సమస్య కారణంగా కొద్దిసేపు నిలిపివేసినా, ఆ తర్వాత రాకెట్ ప్రణాళిక ప్రకారమే నిప్పులు చిమ్ముతూ ఆకాశంలోకి దూసుకెళ్లింది. రాకెట్‌కు సంబంధించిన నాలుగు దశలు అనుకున్నట్టుగానే పనిచేయడమే కాకుండా ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టే ప్రక్రియ కూడా తొలి ప్రయత్నంలోనే విజయవంతమైంది. ఈ చారిత్రక విజయం స్కైరూట్ బృందంలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

### 'విక్రమ్-1' ప్రత్యేకతలు

దాదాపు ఏడు అంతస్తుల ఎత్తు ఉండే విక్రమ్-1 రాకెట్‌ను పూర్తిగా కార్బన్ కాంపోజిట్ మెటీరియల్‌తో నిర్మించారు. ఇది 350 కిలోల బరువున్న పేలోడ్లను భూమికి సమీపంలోని కక్ష్య (లో ఎర్త్ ఆర్బిట్)లోకి మోసుకెళ్లగలదు. ఈ రాకెట్‌లో ఉపయోగించిన ప్రొపల్షన్ సిస్టమ్స్, అధునాతన 3డి-ప్రింటెడ్ ఇంజన్లు, హై-పెర్ఫార్మెన్స్ సాలిడ్ రాకెట్ మోటార్లు వంటి కీలక భాగాలన్నింటినీ స్కైరూట్ సంస్థే స్వయంగా అభివృద్ధి చేసింది. ఈ తొలి ప్రయోగంలో గ్రాహ స్పేస్, కాస్మోసర్వ్, డీక్యూబ్డ్ వంటి సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ పేలోడ్లతో పాటు, స్కైరూట్‌కు చెందిన 'స్కోప్' ప్రయోగాన్ని కూడా పంపించారు. వీటితో పాటు కొన్ని ప్రత్యేకమైన వస్తువులను కూడా అంతరిక్షంలోకి పంపారు. వాటిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వదస్తూరితో రాసిన 'వందేమాతరం' పోస్ట్‌కార్డ్, ఇస్రో ప్రస్తుత, మాజీ చైర్మన్లు, భారత వ్యోమగాములు, స్కైరూట్ ఉద్యోగులు, పెట్టుబడిదారులు రాసిన సందేశాలు ఉన్నాయి. ఈ విజయం కేవలం రాకెట్ పనితీరును నిర్ధారించడానికే పరిమితం కాదు. అంతరిక్ష రంగంలో ఇస్రోతో పాటు ప్రైవేట్ సంస్థలకు కూడా తలుపులు తెరుస్తూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలకు ఇది ఒక పెద్ద విజయంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రయోగం ద్వారా లభించిన కీలకమైన ఇంజినీరింగ్ డేటా, భవిష్యత్తులో విక్రమ్ సిరీస్ రాకెట్లను మరింత మెరుగుపరచడానికి, క్రమం తప్పకుండా వాణిజ్య ప్రయోగాలు చేపట్టడానికి స్కైరూట్‌కు సహాయపడుతుంది. ఇస్రో మాజీ శాస్త్రవేత్తలైన పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా 2018లో స్కైరూట్ ఏరోస్పేస్‌ను స్థాపించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న చిన్న ఉపగ్రహాల మార్కెట్‌కు తక్కువ ఖర్చుతో, నమ్మకమైన సేవలు అందించడమే లక్ష్యంగా వారు ఈ సంస్థను ప్రారంభించారు. 2022లో 'విక్రమ్-ఎస్' అనే సబ్-ఆర్బిటాల్ రాకెట్‌ను ప్రయోగించి, అంతరిక్షంలోకి రాకెట్‌ను పంపిన తొలి భారతీయ ప్రైవేట్ సంస్థగా స్కైరూట్ ఇప్పటికే చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. తాజా విజయంతో భారత అంతరిక్ష యానంలో ఇస్రోతో పాటు ప్రైవేట్ రంగం కూడా ఒక కీలక శక్తిగా నిలిచింది.

## 500 మందికి పైగా రోహింగ్యాలతో రెండు పడవలు అదృశ్యం

మొదటిపేజీ తరువాయి - ఉంటారని ఐక్యరాజ్యసమితి (యుఎన్) ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇటీవల కాలంలో మైనారిటీ రోహింగ్యాలకు ఎదురైన అత్యంత దారుణమైన సముద్ర ప్రమాదాలలో ఇది ఒకటిగా నిలిచే అవకాశం ఉందని మానవతా సంస్థలు పేర్కొంటున్నాయి. జూన్ 29న మయన్మార్‌లోని సిన్ టెట్ మావ్ గ్రామం నుండి ఈ రెండు పడవలు బయలుదేరాయి. ఒక పడవలో 250 మంది, మరో పడవలో 280 మంది ప్రయాణిస్తున్నారు. వీరిలో ఎక్కువ భాగం మహిళలు, పిల్లలే ఉన్నారు. సముద్రంలో ప్రయాణించిన కొన్ని గంటలకే మొదటి పడవతో సంబంధాలు తెగిపోగా, రెండో పడవ జులై 8 ప్రాంతంలో మయన్మార్ తీరానికి సమీపంలో మునిగిపోయినట్లు సమాచారం. ప్రస్తుతం బంగాళాఖాతంలో రుతుపవనాల వల్ల భారీ వర్షాలు, భీకర గాలులు, రాకాసి అలలు ఎగిసిపడుతున్నాయి. వీటికి తోడు స్మగ్లర్లు వాడిన పాత పడవల్లో ఇంజన్లు చెడిపోవడం, సామర్థ్యానికి మించి జనాలను ఎక్కించడం వల్లే ఈ ఘోరం జరిగి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ ప్రమాదం జరిగి వారాలు గడుస్తున్నా ఏ ప్రభుత్వం కూడా అధికారికంగా గాలింపు చర్యలు చేపట్టలేదు. అయితే బంగ్లాదేశ్, మయన్మార్ తీర ప్రాంతాలకు కొట్టుకొచ్చిన కొందరు మహిళలు, పురుషుల మృతదేహాలను మత్స్యకారులు గుర్తించడంతో ఈ పడవలు మునిగిపోయినట్లు స్పష్టమవుతోంది. మయన్మార్‌లో ప్రస్తుతం సైన్యానికి, ఆరకాన్ ఆర్మీకి మధ్య తీవ్రమైన అంతర్యుద్ధం నడుస్తుండటంతో కమ్యూనికేషన్ వ్యవస్థలు పూర్తిగా స్తంభించిపోయాయి. దీంతో ఈ ప్రమాదానికి సంబంధించిన కచ్చితమైన వివరాలను సేకరించడం సహాయక సంస్థలకు సవాలుగా మారింది. ఈ శరణార్థులు సముద్ర మార్గం ద్వారా థాయ్‌లాండ్ చేరుకుని, అక్కడ నుండి రోడ్డు మార్గంలో మలేషియా వెళ్లాలని ప్లాన్ చేసుకున్నట్లు తెలుస్తోంది.

### ఎందుకు ఈ సాహసాలు?

2017లో మయన్మార్ సైన్యం జరిపిన నరమేధం వల్ల దాదాపు 12 లక్షల మంది రోహింగ్యాలు బంగ్లాదేశ్ శరణార్థి శిబిరాల్లో మగ్గుతున్నారు. మరో 6 లక్షల మంది మయన్మార్‌లోనే బందీలుగా జీవిస్తున్నారు. ఇటీవల అంతర్జాతీయ సాయం తగ్గడంతో వీరికి తిండి కొరత తీవ్రమైంది. దీనికి తోడు స్థానిక యువకులను బలవంతంగా సైన్యంలోకి చేర్చుకుంటుండటంతో, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు వీరు ఇలాంటి ప్రమాదకరమైన సముద్ర ప్రయాణాలను ఆశ్రయిస్తున్నారు.

## 'బుల్లెట్ ట్రైన్'పై లడాయి

మొదటిపేజీ తరువాయి - అంతర్జాతీయంగా ఒక కొత్త వివాదం రేగింది. ఈ ప్రాజెక్టు ఆలస్యం కావడానికి భారత ప్రభుత్వ అధికారుల అనాలోచిత నిర్ణయాలు, పట్టువిడుపులు లేని వైఖరే కారణమంటూ జపాన్ న్యాయశాఖ మాజీ మంత్రి హిడెకి మాకిహారా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సంచలన ఆరోపణలు చేశారు. అయితే, భారత విదేశాంగ శాఖ ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. ప్రాజెక్టు పనులు చాలా వేగంగా, పక్కాగా సాగుతున్నాయని స్పష్టం చేసింది.

### ఇండియా వైపు అధికారులదే తప్పు: జపాన్ మాజీ మంత్రి

జపాన్‌కు చెందిన సీనియర్ రైల్వే ఇంజనీర్ ఇసావో సుజిమురా రాసిన ఒక వ్యాసాన్ని ప్రస్తావిస్తూ "భారతదేశంలో షింకాన్సెన్ (బుల్లెట్ ట్రైన్) ప్రాజెక్టు చర్చల్లో నేను కూడా పాలుపంచుకున్నాను. అంతర్జాతీయ సమావేశాల్లో భారత అధికారుల మొండితనం స్పష్టంగా కనిపించేది. వారు ఇచ్చిన మాట అస్సలు నిలబెట్టుకోరు, వెంటనే మాట మారుస్తారు. తమ స్వప్రయోజనాల కోసమే చివరివరకు పట్టుబడతారు. ఈ ప్రాజెక్టు ఆలస్యమవడానికి నూటికి నూరు శాతం భారత అధికారులదే బాధ్యత" అని మాకిహారా ఆరోపించారు. జపాన్ ప్రధానమంత్రి సనాయ్ తకైచి 2026 జులైలో జరిపిన భారత్ పర్యటన కూడా ఈ విషయంలో పెద్దగా పురోగతి సాధించలేకపోయిందని ఆయన పేర్కొన్నారు.

రాజకీయ దుమారం.. రంగంలోకి విదేశాంగ శాఖ

జపాన్ నేత చేసిన ఈ ఆరోపణలను అస్త్రంగా చేసుకుని కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అత్యంత కీలకమైన సిగ్నలింగ్ వ్యవస్థ నుంచి జపాన్‌ను భారత్ తప్పించిందని ఆయన ఆరోపించారు. ఈ వివాదంపై విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ.. ఆ ఆరోపణలు కేవలం ఒక వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని, క్షేత్రస్థాయి వాస్తవాలతో దానికి ఎలాంటి సంబంధం లేదని కొట్టిపారేశారు. సిగ్నలింగ్ పరికరాల కోసం అంతర్జాతీయ నిబంధనల ప్రకారమే ఆర్డర్లు ఇచ్చామని, ఈ విషయంలో జపాన్ నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని స్పష్టం చేశారు.

2027 లోనే బుల్లెట్ రైలు ప్రారంభం

జపాన్ ప్రభుత్వ ఆర్థిక సాయంతో (జైకా రుణాలతో), వారి సాంకేతికతతోనే 508 కిలోమీటర్ల మేర

## 'నా అనుమతి లేకుండా చికిత్స వద్దు'

మొదటిపేజీ తరువాయి - చేయొద్దని ఆయన భార్య గీతాంజలి జె.అంగ్మో విజ్ఞప్తి చేశారు. గత 20 రోజులుగా ఆయన ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్న వైద్యుల అంగీకారం లేకుండా నోటి ద్వారా గానీ, సిరల ద్వారా గానీ ఆయనకు ఎలాంటి చికిత్స అందించొద్దని 'ఎక్స్' వేదికగా కోరారు. 20 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న వాంగ్‌చుక్‌ను పోలీసులు శనివారం తెల్లవారుజామున ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు, వైద్య నిపుణుల సూచన మేరకు వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఉదయం నిరసన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ సమయంలో తోటి ఆందోళనకారులు నినాదాలు చేస్తూ అడ్డుకునే ప్రయత్నం చేయడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అయినా పోలీసులు అత్యంత సంయమనంతో చర్యలు చేపట్టినట్లు ఢిల్లీ డిప్యూటీ పోలీస్ కమిషనర్ వెల్లడించారు. జంతర్‌మంతర్‌ను శాంతియుతంగా ఖాళీ చేయాలని నిరసనకారులకు విజ్ఞప్తి చేశారు. వాంగ్‌చుక్ ఆరోగ్యంపై విచారణ జరపాల్సిన రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. ఆయనకు రోజూ వైద్య పరీక్షలు నిర్వహించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. ప్రతి పౌరుడి ప్రాణం విలువైనదేనని పేర్కొంటూ, అవసరమైన వైద్య సేవలు అందించాలని కేంద్రానికి సూచించింది. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలకు బాధ్యతవహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వాంగ్‌చుక్ ఈ నిరాహార దీక్ష చేపట్టారు. ఇదే డిమాండ్‌తో జులై 20న జంతర్‌మంతర్ నుంచి పార్లమెంట్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామని కూడా ప్రకటించారు.

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
ఆదివారం 19-07-2026

# గంగారం గ్రామస్తుల అభ్యర్థన మేరకు పోచమ్మ అమ్మవారి పునర్నిర్మాణ స్థలాన్ని పర్యవేక్షించిన రాష్ట్ర అధికార ప్రతినిధి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్

**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి జూలై,18:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చేపట్టనున్న మెట్రో రైల్వే ఫ్లైఓవర్, రోడ్డు విస్తరణ పనుల కారణంగా గంగారం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ గోపురం దెబ్బతినే అవకాశం ఉందని, అలాగే పోచమ్మ అమ్మవారి ఆలయాన్ని పూర్తిగా తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని.. ఈ నేపథ్యంలో పోచమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామంలో స్థలం కేటాయించాలని మరియు రామాలయం , ఆంజనేయస్వామి ఆలయ గోపురం దెబ్బతినకుండా చూడాలని నిన్న గంగారాం గ్రామస్తులు కోరడంతో.. శనివారం గంగారం గ్రామస్తులతో కలిసి ఆలయ పరిసర ప్రాంతాన్ని సందర్శించి సంబంధిత అధికారులతో మాట్లాడి తప్పకుండా ఈ సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని వారికి హామీ గ్రామానికి కావలసిన కమ్యూనిటీ హాల్, ఆలయాల నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాల్ యాదవ్, దొంతి శేఖర్ ముదిరాజ్, రాజు, రామకృష్ణ గౌడ్ ,రాజేందర్, రవి కుమార్ ,రాజు యాదవ్ , అర్జున్ ,రాజేందర్, సాయి కిరణ్ ,రాజు శ్రావణ్ కుమార్, నరసింహ ,ఎం రాజు, భాస్కర్, స్వామి అశోక్, మొదలగు వారు పాల్గొన్నారు




# కన్నీళ్ల ఖరీఫ్...

నెలన్నర రోజులుగా కనిపించని వర్షాల జాడ...

31 మండలాల్లో లోటు వర్షపాతం...

వట్టి పోతున్న బోరుబావులు- అడుగంటిన భూగర్భ జలాలు...

పది మండలాల్లో అత్యంత లోటు వర్షపాతం...

**జూలై 18 నిజం న్యూస్:** ధాన్య గారంగా పేరొందిన ఇందూరు జిల్లా ఈ ఖరీఫ్ సీజన్ లో నేడు బీడు భూములుగా దర్శనమిస్తోంది. వర్షాకాలం ప్రారంభమై నెల 15 రోజులు గడుస్తున్న నేటికీ పూర్తిస్థాయిలో వరుణుడు కరుణించిన దాఖలాలు లేకపోగా, భూగర్భ జలాలు ఉన్నాయనుకుని రైతులు బోరుబావుల పై ఆధారపడి పంటల సాగుకు ముందుకు వచ్చిన రైతన్నలకు నిరాశ కళ్లెదుట కనిపిస్తోంది. కళ్ళ ముందు పంటలు పంటలు ఎండిపోయి అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. మరికొందరు రైతులు ముందస్తుగా వేసిన పంటలు సైతం దుక్కు దున్ని వేరే పంటలు సాగు చేసేందుకు ముందుకు వచ్చినప్పటికీ ఆ పరిస్థితులు సైతం కనిపించకపోవడంతో రైతాంగం మరింత నష్టాల పాలు కానునట్లు రైతన్న లు వా పోతున్నారు. నెల రోజులు కావస్తున్న పరిస్థితి ఇలాగే ఉంటే మునుముందు ఎలా ఉంటుందో నని మరింత ఆందోళన మొదలైంది. వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్న రైతన్నలకు ఈ సీజన్లో పడుతున్న కష్టం మరింత నష్టంగా మారేలా ఉందని రైతులు వాపోతున్నారు. పచ్చని పొలాల్లో భూమికి పచ్చని పందిరి వేసినట్లు ఉండే వరి పంటలు భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో రైతన్నల ఆశలు ఆవిరైపోతున్నాయి. ఎగువ ప్రాంతంలో మంజీరా నది, దిగువల గోదావరి నదుల సమ్మేళనంతో అన్నపూర్ణగా వెలుగొందుతున్న ఇందూరు జిల్లాలో ప్రస్తుతం కరువు ఛాయలు




కమ్మేశాయి. వానాకాలం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు అడపా దడప చిరుజల్లులు కురుస్తున్నప్పటికీ, ఇప్పటివరకు మోర్తాడ్ వర్షాలు కూడా నమోదు కాకపోవడంతో రైతులు తీవ్ర నిస్సాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గోదావరి, మంజీరా నదులతో పాటు, నిజాంసాగర్, శ్రీరామ్ సాగర్ జలాసాయలకు ఇప్పటివరకు వరద నీరు వచ్చి చేరలేదు. చెరువులు, వాగులు,కుంటలు జలకళలేక వేల వేల బోతున్నాయి. జిల్లాలో రైతందానికి 1.05 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే శ్రీరామ్ సాగర్ జలాశయం దీన స్థితికి చేరుకుంది. గోదావరిపై ఆధారపడిన మధ్యతర ఎత్తిపోతల పథకాలైన అరుగుల రాజారాం (గుత్ప ) అలీ సాగర్ ఎత్తిపోతలు నీరందించే పరిస్థితి కనిపించడం లేదు. అలాగే రన్నింగ్ లో ఉన్న మరో పదహారు మినీ ఎత్తిపోతల పథకాలు మరుగున పడ్డాయి. బోరు బావుల పైనే ఆధారపడి నాట్లేసిన 1.30 లక్షల ఎకరాల వరి పంటను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పసుపు మొక్కజొన్న సోయాబీన్ వంటి ఆరుతడి పంటలను రక్షించుకునేందుకు రైతన్నలు నానా అవస్థలు పడుతున్నారు. జిల్లాలో 5.45 లక్షల ఎకరాల్లో రైతాంగం పంటలు పండిస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేస్తే, ఇప్పటివరకు మూడు లక్షల ఎకరాల కూడా చేరుకోలేకపోయిందని, మరో వారం రోజులు వర్షాలు కురవకపోతే వేసిన పంటలు సైతం ఎండిపోయే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వార్షిక సాధారణ సగటు వర్షపాతం 945.8 మిల్లీమీటర్లు గా ఉంది. అయితే ఇప్పటివరకు ( 15-07- 20 26 ) 283.9 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదయింది. కాగా సగటున 33 మండలాల్లో పరిశీలిస్తే- 49 మిల్లీమీటర్ల వర్షపాతం లోటు కనిపిస్తుంది. ఒక సిరికొండ, ధర్పల్లి మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, మరో 21 మండలాల్లో లోటు వర్షపాతం కనిపిస్తోంది. ఇక ఆలూర్, ఏరు గట్ల, ఆర్మూర్, బాల్కొండ, సాలూర, మెండోరా, పోతంగల్, మాక్కులూర్,మోపాల్ మండలాల్లో అత్యంత లోటు వర్షపాతం ఉండడం గమనార్హం.

### ప్రత్యామ్న మయ పంటలకు ప్రణాళికలు రూపొందిస్తున్న అధికారులు...

తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, రైతులకు ప్రత్యామ్నాయంగా పంటల ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు, సమృద్ధిగా నీటి వరం వనరులు ఉన్నచోటనే వరి సాగు చేసుకోవాలని రైతాంగానికి వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఈ నెలాఖరులోపు వర్షాలు కురుస్తాయని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఒకవేళ సరియైన వర్షాలు కురయకపోతే ప్రత్యామ్నాయ పంటల కోసం ప్రణాళికలు రూపొందించి సిద్ధం చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా ఈసారి లెనిన్ ప్రభావం చూపిస్తుంది అనేది వాస్తవంగా తెలుస్తోంది. కాగా వరుణ దేవుడు కరుణిస్తే, పుష్కలంగా వర్షాలు కురిస్తే రైతన్నలు గట్టెక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయి. మరోపక్క ఐ ఎం డి వాతావరణ శాఖ సైతం ఈ వారం రోజులు వర్షాలు కురుస్తాయని పేర్కొంటుంది.

# గచ్చిబౌలి ఆనంద దేవస్థానం వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన జగన్నాథ రథయాత్ర కార్యక్రమం

జగన్నాథ రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ...మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్

**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, జూలై 18:** శనివారం కొండాపూర్ డివిజన్ రోలింగ్ హిల్స్ లో గచ్చిబౌలి ఆనంద దేవస్థానం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్ర కార్యక్రమంలో గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ ఇతర నాయకులతో కలిసి రథయాత్రను ప్రారంభించిన...బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్నాథ స్వామి వారి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని ,జగన్నాథ రథయాత్రా మన ధర్మం, సమానత్వం, ఐక్యతకు మరియు భారతీయ సంస్కృతికి నిదర్శనమని,ఈ రథయాత్రలో అందరూ భక్తితో శ్రద్ధలతో నడవటం వల్ల అందరం ఒక్కటే అనే భావన వస్తుందన్నారు, బీజేపీ ఎప్పుడూ మన సంస్కృతి, సంప్రదాయాలు కాపాడటంతో పాటు దేశ ప్రజల సంక్షేమానికి అభివృద్ధికి కట్టుబడి ఉందని,మోదీ గారు మన చరిత్ర ను ,మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ,దేశ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారని, అయోధ్య రామ మందిర నిర్మాణం, వారణాశి కాశి విశ్వనాథ్ ఆలయ ఆధునీకరణ, సబర్మతి, గంగా, యమునా నదుల సుందరీకరణ, ఇలా ఎన్నో చేశారని గుర్తు చేశారు, ముఖ్యంగా మన దేశ యువత అందరూ మన భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను, విలువలను తెలుసుకొని ధర్మాన్ని కాపాడుతూ సమాజ సేవలో పాల్గొనాలని, మన పండుగలు, యాత్రలు ప్రజలందరిని ఒక్కటిగా కలిపే శక్తిగా మారాలన్నారు, జగన్నాథ స్వామి కృపతో ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నానన్నారు,ఈ కార్యక్రమంలో



# 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల వివరాలు

**నిజం న్యూస్ హైదరాబాద్ జూలై 18:**

ఉత్తమ తెలుగు చిత్రం - కమిటీ కుర్రోళ్లు
ఉత్తమ మేకప్ - పి.రవికుమార్ (కమిటీ కుర్రోళ్లు)
బెస్ట్ డైలాగ్ రైటర్ - వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
బెస్ట్ స్క్రీన్‌ప్లే రైటర్ (ఒరిజనల్) - సుకుమార్ (పుష్ప-2)
బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్ - దీపాలి నూర్, శీతల్ శర్మ (పుష్ప-2)
ఉత్తమ బాలల చిత్రం - 35 చిన్న కథ కాదు
ఉత్తమ పాపులర్ చిత్రం - కల్కి 2798 ఏడీ
అవార్డులు లైవ్ 44
ఉత్తమ చిత్రం - ఆర్టికల్ 370
ఉత్తమ నటుడు - మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్ (సంయుక్తంగా)
ఉత్తమ నటి - యామీ గౌతమ్ (ఆర్టికల్ 370)
ఉత్తమ దర్శకుడు - రాజ్‌కుమార్ పెరియస్వామి (అమరన్)
ఉత్తమ నేపథ్య గాయని - వైకోం విజయలక్ష్మి (ఏఆర్ఎం)
ఉత్తమ నేపథ్య గాయకుడు - అభయ్ జోధ్ పుర్కర్
బెస్ట్ సినిమాటోగ్రఫర్ - జలాల్ (భ్రమయుగం)
ఉత్తమ జాతీయ సమైక్యతా చిత్రం - కెప్టెన్ మిల్లర్ (తమిళం)
అవార్డులు లైవ్ 33
బెస్ట్ ప్రొడక్షన్ డిజైనర్ - నితిన్ జిహానీ చౌదరి (కల్కి 2798 ఏడీ)
బెస్ట్ ఎడిటర్ - కలైవన్నన్ (అమరన్)
బెస్ట్ సౌండ్ డిజైనర్ - మానస్ చౌదరి (భూల్ బులియా)
బెస్ట్ స్క్రీన్‌ప్లే రైటర్ - యోగేశ్ దేశ్‌పాండే





ఉత్తమ పాటల రచయిత -- మనోజ్ ముంతాసిర్ (మైదాన్)
ఉత్తమ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ -- జీవీ ప్రకాశ్ కుమార్ (అమరన్)
ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు) - శశ్వంత్ సచ్‌దేవ్ (ఆర్టికల్ 370)
అవార్డులు లైవ్ 22
ఉత్తమ తమిళ చిత్రం - రాయన్
ఉత్తమ మలయాళ చిత్రం - ఫెమినిస్ట్ ఫాతిమా
ఉత్తమ కన్నడ చిత్రం - మిథ్య (ఇల్యూజన్)
ఉత్తమ హిందీ చిత్రం - శ్రీకాంత్
ఉత్తమ గుజరాత్ చిత్రం - మారన్ (ద హంట్)
ఉత్తమ బెంగాలీ చిత్రం - చల్‌చిత్ర ఎఖో
అవార్డులు లైవ్ 11
బెస్ట్ ఫిల్మ్ క్రిటిక్ - సంజీవ్ శ్రీవాస్తవ (హిందీ)
సినిమాలపై ఉత్తమ పుస్తక రచయిత -- ప్రదీప్‌కుమార్ శెట్టి (కన్నడ)
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: స్పెషల్ మెన్షన్ - ద చోలా డోరా ఔర్ సూయి
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: స్పెషల్ మెన్షన్ - భద్రకాళి నాటకం
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: బెస్ట్ స్క్రిప్ట్ - ఓబుర్
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: బెస్ట్ సినిమాటోగ్రఫీ - లైవ్ ఇన్ లూమ్
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: బెస్ట్ డైరెక్షన్ - ఆనంద్ రాయ్ (స్టాట్యూ ఆఫ్ యూనిటీ)
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: బెస్ట్ డాక్యుమెంటరీ - రామ్ నమీ
స్పెషల్ మెన్షన్ - మేయళగన్ (తమిళం)
స్పెషల్ మెన్షన్ - తమిళ చిత్రం కెప్టెన్ మిల్లర్ (ధనుష్)

# కెపిహెచ్బి సీనియర్ నాయకుడు పీ.వీ. రమణ తండ్రి పి. వెంకయ్యకు నివాళులర్పించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 18:** కె పి హెచ్ బి కాలనీ సీనియర్ నాయకుడు పి.వి. రమణ తండ్రి, పి. వెంకయ్య పరమపదించారు. ఈ విషయం తెలియగానే కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బి ఆర్ యస్ పార్టీ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, పగడాల బాబూరావు వారి నివాసానికి చేరుకుని ఆయన పార్థివదేహానికి అంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిరాడంబర జీవనం, మంచితనం, మానవత్వం, కుటుంబం పట్ల ఆయన చూపిన ప్రేమ ఎల్లప్పుడూ అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి అని అన్నారు..

# శ్రీ పి.వి. వెంకయ్య పార్థివదేహానికి నివాళు లర్పించిన జనసేన నాయకులు: ప్రేమ కుమార్



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 18:** శనివారం కె పి హెచ్ బి కాలనీ సీనియర్ నాయకుడు పి.వి. రమణ తండ్రి, పి. వెంకయ్య పరమపదించారు. విషయం తెలియగానే కూకట్పల్లి నియోజక వర్గం జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ , జనసేన నాయకులు కొల్లా శంకర్ వారి నివాసానికి వెళ్లి వెంకయ్య పార్థివదేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# భక్తులకు ఇబ్బందులు లేకుండా అమ్మవారి ఉత్సవం ఏర్పాట్లు పూర్తి చేయాలి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**నిజం న్యూస్ సనత్ నగర్, జూలై 18:** శ్రీ బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం శనివారం మాజీ మంత్రివర్యులు, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న శ్రీ బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం, 22వ తేదీన జరగనున్న రథోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్, భద్రత తదితర ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



# స్వర్ణ వివాహ వేడుకల్లో దంపతులను సత్కరించి ఆశీర్వాదాలు పొందిన పెద్ది హేమలత కిషోర్



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 18:** ఆప్తమిత్రుడు, సోదర సమానుడు తమ్మినీడి సూర్య చంద్రశేఖర్ “మాతాపితలు” తమ్మినీడి రామలింగేశ్వర రావు తమ్మినీడి సూర్య కుమారి వివాహబంధంలోకి అడుగుపెట్టి 50 వసంతాలైన సందర్భంగా “ఖూంది 9వ ఫేస్ వినాయక మండపం” నందు నిర్వహించిన లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణోత్సవం లో పాల్గొని, పెద్దలు తమ్మినీడి రామలింగేశ్వర రావు ని తమ్మినీడి సూర్య కుమారిని పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపి వారిరువురి ఆశీర్వచనాలు తీసుకోవడం జరిగింది. ఇటువంటి స్వర్ణోత్సవ వివాహ వేడుకలు జరగడం నేటి యువ సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తుందని, భారతీయ కుటుంబ వ్యవస్థ పటిష్టత తెలుపుతుందని ఈ సందర్భంగా సంతోషాన్ని వ్యక్తపరచడమైనది. మనుమలు, మనుమరాలు, తమ్మినీడి-చిలుకూరి సోదర సోదరీమణుల సమక్షంలో ఈ వేడుక నిర్వహించిన వారి కుమారులు తమ్మినీడి సూర్య చంద్రశేఖర్, తమ్మినీడి సత్యనారాయణ ( సతీష్ ) దంపతులను మరియు కుటుంబ సభ్యులను అభినందించడమైనది పెద్ది హేమలత కిషోర్.

# ఓటరు జాబితాలో పేరు లేకపోతే పౌరసత్వం పోదు: సుప్రీంకోర్టు



**నిజం న్యూస్ హైదరాబాద్, జూలై 18:** ఓటరు జాబితాలో పేరు లేనంత మాత్రాన ఎవరూ పౌరసత్వాన్ని కోల్పోరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై దాఖలైన పిటిషన్‌ను విచారిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక వ్యక్తి పౌరసత్వాన్ని నిర్ధారించే అంతిమ అధికారం ఎన్నికల సంఘానికి లేదని కోర్టు తేల్చి చెప్పింది. ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా ఉండాలని, పేర్లు తొలగింపునకు గురైన వారికి సరైన అప్పీల్ వ్యవస్థ ఉండాలని సూచించింది. ఓటు హక్కు లేదనే నెపంతో సంక్షేమ పథకాలను నిరాకరిస్తున్నారన్న ఆరోపణలపై కూడా విచారణ జరుపుతామని ధర్మాసనం పేర్కొంది.

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
ఆదివారం 19-07-2026

# బేబీ బంప్‌తో స్టన్నింగ్ లుక్... రెడ్ బీచ్ డ్రెస్‌లో ఆకట్టుకున్న 'సామజవరగమన' బ్యూటీ



థాయిలాండ్‌లోని ఫుకెట్ బీచ్ రిసార్ట్‌లో రెడ్ కలర్ ప్రింటెడ్ మ్యాక్సీ డ్రెస్ ధరించి, తన బేబీ బంప్‌ను చూపిస్తూ ఆమె దిగిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి. తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సామజవరగమన' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న మలయాళ ముద్దుగుమ్మ రెబా మోనికా జాన్. తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, సహజమైన నవ్వుతో సౌత్ ఇండియాలో ప్రత్యేకమైన క్రేజ్ సంపాదించుకున్న ఈ నటి, తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. థాయిలాండ్‌లోని ఫుకెట్ బీచ్ రిసార్ట్‌లో రెడ్ కలర్ ప్రింటెడ్ మ్యాక్సీ డ్రెస్ ధరించి, తన బేబీ బంప్‌ను చూపిస్తూ ఆమె దిగిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి. పెళ్లి తర్వాత కూడా కెరీర్‌లో దూకుడు: మోడలింగ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న రెబా మోనికా జాన్ ట్రెడిషనల్ శారీస్ అయినా, మోడ్రన్ వెస్ట్రన్ వేర్ అయినా చాలా స్టైలిష్‌గా క్యారీ చేస్తుంది. ఈమె 2022 జనవరిలో తన చిరకాల మిత్రుడు జోమోన్ జోసెఫ్‌ను వివాహం చేసుకున్నారు. ఇక ఇక పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో ఎంతో యాక్టివ్‌గా ఉంటున్న ఈ బ్యూటీ, తెలుగులో సామజవరగమన తో పాటు మృత్యుంజయ్, మ్యాడ్ స్క్వేర్ వంటి క్రేజీ చిత్రాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. బీచ్ లో రెడ్ డ్రెస్ హంగామా – ప్రెగ్నెన్సీ గ్లో: ప్రస్తుతం ప్రెగ్నెంట్‌గా ఉన్న రెబా, ద నాకా ఫుకెట్ రిసార్ట్‌లో వెకేషన్‌ను ఫుల్‌గా ఎంజాయ్ చేస్తోంది. అక్కడ బీచ్ ఒడ్డున వైబ్రెంట్ రెడ్ ప్రింటెడ్ స్ట్రాపీ మ్యాక్సీ బీచ్ డ్రెస్ ధరించి సరికొత్తగా ఫోటోలకు పోజులిచ్చింది. హై లెగ్ స్లిట్ ఉన్న ఈ డ్రెస్‌లో ఆమె తన మెటర్నిటీ లుక్‌ను ఎంతో కాన్ఫిడెంట్‌గా ప్రదర్శించింది. ఇక ఇక ఆమె ముఖంలో కనిపిస్తున్న ప్రెగ్నెన్సీ గ్లో చూసి అభిమానులు మురిసిపోతున్నారు. "ప్రెగ్నెన్సీ గ్లో అనేది నిజంగానే అద్భుతం" అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. సమయం ఎంత వేగంగా గడిచిపోయింది: తన బేబీ బంప్ ఫోటోలను షేర్ చేస్తూ రెబా మోనికా జాన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన క్యాప్షన్ కూడా అందరినీ ఆకట్టుకుంటోంది. "సమయం ఇంత వేగంగా ఎలా గడిచిపోయింది? బేబీ బంప్‌తో గడిపే చివరి కొన్ని రోజులు ఇవి" అంటూ ఆమె ఎమోషనల్ అయ్యింది. ఇక త్వరలోనే మాతృత్వపు తీపి అనుభూతిని పొందబోతున్న తరుణంలో ఆమె ముఖంలోని ఆనందం ఈ ఫోటోలలో స్పష్టంగా కనిపిస్తోంది. రెబా షేర్ చేసిన ఈ బ్యూటిఫుల్ ఫోటోలు చూసి ఫ్యాన్స్, సెలబ్రిటీలు ఆమెకు పెద్ద ఎత్తున కంగ్రాట్స్ చెప్తున్నారు. ఈ ప్రెగ్నెన్సీ సమయంలో జాగ్రత్తగా ఉండాలంటూ అభిమానులు కామెంట్ల సెక్షన్‌లో ప్రేమను కురిపిస్తున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో రాచరికపు అందాన్ని వలకబోసే ఈ సామజవరగమన బ్యూటీ, ఇప్పుడు ప్రెగ్నెన్సీ లుక్‌లోనూ అంతే స్టైలిష్‌గా మరియు క్యూట్‌గా కనిపిస్తూ అందరి హృదయాలను గెలుచుకుంటోంది.



## సాయి పల్లవి సరికొత్త యాక్షన్ అవతారం!



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ కథానాయకుడిగా ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న –ఐ5– చిత్రంలో సాయి పల్లవి కథానాయికగా ఎంపికైన సంగతి తెలిసిందే. దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనదైన నటనతో.. సహజసిద్ధమైన హావభావాలతో ప్రేక్షకుల గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు సాయి పల్లవి. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటూ నటనకు ప్రాధాన్యత ఉన్న కథలను ఎంచుకుంటూ లేడీ పవర్ స్టార్ అనే ట్యాగ్ ను అనతి కాలంలోనే దక్కించుకున్నారు. అయితే ఇంతవరకూ సాయి పల్లవి టచ్ చేయని జోనర్ అంటూ ఒకటి ఉంది. ఇప్పటివరకూ ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించిన పల్లవి మాత్రం సరైన మాస్ రోల్ మాత్రం పోషించలేదు. ఈ నేపథ్యంలో తొలిసారి పక్కా మాస్ యాక్షన్ రోల్‌లో అలరించడానికి అమ్మడు రెడీ అవుతోంది. కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ కథానాయకుడిగా ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న –ఐ5– చిత్రంలో సాయి పల్లవి కథానాయికగా ఎంపికైన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో అమ్మడు పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తుండటం విశేషం. ఖాకీ దుస్తులు ధరించి చట్టాన్ని రక్షించే పటిష్టమైన పాత్రలో వెండితెరపై కనిపిం చంబోతుంది. ఇప్పటి వరకు సాఫ్ట్ రోల్స్ చేసిన సాయి పల్లవి నుండి ఇలాంటి ఒక రౌద్రరూపాన్ని ఎవరూ ఊహించలేదు. ఈ భారీ ప్రాజెక్ట్‌ను ఇటీవల –అమరన్– చిత్రంతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న దర్శకుడు రాజ్‌కుమార్ పెరియస్వామి తెరకెక్కిస్తున్నారు. ఆయన సినిమాల్లో పాత్రల రూపకల్పన ఎంతో సహజంగా.. సమాంతరంగా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ఈ క్రమంలోనే ఐ5 చిత్రంలో సాయి పల్లవి పాత్రను సాధారణ హీరోయిన్‌గా కాకుండా.. కథను మలుపు తిప్పే బలమైన యాక్షన్ ఓరియెంటెడ్ క్యారెక్టర్‌గా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ పోలీస్ పాత్రకు న్యాయం చేయడం కోసం సాయి పల్లవి ఎక్కడా తగ్గడం లేదు. ఇందులో ఉండే హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్– ఫైట్ సీన్స్ కోసం ప్రత్యేకంగా మార్షల్ ఆర్ట్స్ .. ఫిజికల్ ట్రైనింగ్ కూడా ప్రారంభించింది. నృత్యంలో సాయిపల్లవికున్న ఫ్లెక్సిబిలిటీ .. టైమింగ్ ఈ యాక్షన్ స్టంట్స్ చేయడంలో ఆమెకు ఎంతో ప్లస్ అవుతుందని చిత్ర బృందం భావిస్తోంది. డూప్స్ లేకుండా రియలిస్టిక్ యాక్షన్ సీన్స్ చేయడానికి పల్లవి మొగ్గు చూపుతుండటం విశేషం. ధనుష్– సాయి పల్లవి కాంబినేషన్‌కు సౌత్ సినీ ఇండస్ట్రీలో మంచి క్రేజ్ ఉంది. గతంలో ఇద్దరి కలయికలో రిలీజ్ అయిన –మారి 2– చిత్రంలోని రౌడీ బేబీ పాట సృష్టించిన రికార్డులు అన్నీ ఇన్నీ కావు. ఆ సినిమాలో ఇద్దరి మధ్య ఆన్–స్క్రీన్ కెమిస్ట్రీ, ఎనర్జీ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్ రిపీట్ అవ్వడం..అదీ ఓ సీరియస్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో కావడం సినిమాపై అంచనాలను స్కై ని తీసుకెళ్తున్నాయి. ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా నటిగా తనను తాను నిరంతరం రీ–ఇన్వెంట్ చేసుకోవడానికి సాయి పల్లవి ప్రయత్నిస్తుంటుందని ఈ పాత్ర ఎంపిక మరోసారి నిరూపించింది. ఎమోషన్స్ మాత్రమే కాకుండా.. మాస్ యాక్షన్ సీన్లను కూడా తాను పండించగలనని నిరూపించుకోవడానికి ఇదొక సువర్ణావకాశం.

# రిటైర్ అయిపోదనుకుంటే షాక్ ఇచ్చిన నటి!

ప్రీతి ఝంగియాని పరిచయం అసవరం లేని పేరు. టాలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమలలో తనదైన ముద్ర వేసిన నటి. పవన్ కళ్యాణ్ సరసన –తమ్ముడు– వంటి బ్లాక్‌బస్టర్ చిత్రంలో నటించి అప్పట్లో ఓవెలుగు వెలిగింది. హిందీలో –మొహబ్బతేన్– చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. అయితే ఈ బ్యూటీ కొంతకాలంగా వెండితెరపై కనిపించకపోవడంతో నటనకు స్వస్తి పలికింది. విదేశాల్లో స్థిరపడిపోయిందనుకున్నారంతా. కానీ అమ్మడు అలాందిలేదంటూ నేను ఇంకా యాక్టివ్ గానే ఉన్నానంటూ షాక్ ఇచ్చింది. –నేను నటనను విడిచిపెట్టాననే వార్తల్లో ఎలాంటి నిజం లేదు. నటన నా ప్రాణం.. సినిమా కెరీర్‌ను ఎంతో ప్రేమిస్తాను– అని ప్రకటించింది. గత కొన్నేళ్లుగా వ్యక్తిగత జీవితంలో కొత్త బాధ్యతలు పెరగడం, పిల్లల ఎదుగుదలపై దృష్టి పెట్టడం వల్లే సినిమాల నుంచి కాస్త విరామం తీసుకోవాల్సి వచ్చిందని అంతే తప్ప పరిశ్రమను వదిలి వెళ్లాలనే ఆలోచన తనకు ఎప్పుడూ రాలేదని వెల్లడించింది. సినిమాలకు తాత్కాలికంగా దూరమైన ఈ సమయంలో ప్రీతి ఝంగియాని భర్త పర్విన్ దబాస్‌తో కలిసి వ్యాపార రంగంలో బిజీగా గడిపారు. ఇద్దరు సంయుక్తంగా ప్రో పంజా లీగ్ అనే ఆర్మ్ రెజ్లింగ్ క్రీడా లీగ్‌ను ప్రారంభించి దేశంలో దానికి మంచి ఆదరణ తెచ్చిపెట్టారు. ఒక పక్క లీగ్ వ్యవహారాలు చూసుకుంటూనే.. మరోపక్క ఇద్దరు కుమారుల బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించినట్లు తెలిపారు. ఇప్పుడు పిల్లలు పెద్దవాళ్లు కావడంతో మళ్లీ నటన వైపు దృష్టి పెట్టడానికి సమయం దొరికిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ మధ్య కాలంలో వచ్చిన ఓటిటి విప్లవం సినీ పరిశ్రమను పూర్తిగా మార్చేసిందన్నారు. ఇది నటీనటులకు అద్భుతమైన వరమని ప్రీతి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం వయసుతో పని లేకుండా నటుల నైపుణ్యానికి తగ్గట్టుగా బలమైన పాత్రలు రూపుదిద్దుకుంటున్నాయని కొనియాడారు. కేవలం హీరోయిన్ పాత్రలే కాకుండా కథను మలుపు తిప్పే ఎలాంటి వైవిధ్యమైన క్యారెక్టర్లు వచ్చినా? చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని నటిగా తనను తాను సరికొత్తగా ఆవిష్కరించుకోవాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే కొన్ని ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌లకు సంబంధించిన చర్చలు జరుగుతున్నట్లు హింట్ ఇచ్చారు. త్వరలోనే కొత్త సినిమాలకు సంబంధించిన అధికారిక ప్రకటనలు వస్తాయని అభిమానులకు భరోసా ఇచ్చారు. ఎన్నేళ్లు గడిచినా ప్రేక్షకులు తనపై చూపిస్తున్న ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా సౌత్ ప్రేక్షకులు తమ్ముడు సినిమాను ఇప్పటికీ గుర్తుపెట్టుకోవడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా వెలిగిన నటీమణులు పెళ్లయి, పిల్లలు పుట్టిన తర్వాత పరిశ్రమకు పూర్తిగా దూరమై పోతారనే పాతకాలపు ఆలోచనా ధోరణిని ప్రీతి ఝంగియాని మాటలు బద్దలు కొడుతున్నాయి. నటనపై ఉన్న మక్కువతో ఇటు కుటుంబాన్ని అటు కెరీర్‌ను సమానంగా బ్యాలెన్స్ చేస్తూ మళ్లీ సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించడానికి సిద్ధమవుతున్న ఆమె నిర్ణయం తోటి నటీమణులకు స్ఫూర్తిదాయకం అని చెప్పొచ్చు.

## ప్రభాస్ 'ఫౌజీ' రూట్ క్లియర్.. ఇద్దరు మెగాస్టార్‌లతో క్లాష్ లేనట్టేనా?

టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ' సినిమా విడుదల తేదీని ఇటీవల అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. మైత్రి మూవీ మేకర్స్– టిసిరీస్ సంయుక్తంగా నిర్మించిన ఈ భారీ చిత్రం 2026 డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ప్రభాస్ కోసం ఈ తేదీని ఎలాంటి క్లాష్ లేకుండా ఒక పద్ధతి ప్రకారం తెలివిగా నిర్ణయించారా? అంటే.... ట్రేడ్ వర్గాల విశ్లేషణ ఇలా ఉంది. డిసెంబర్ మొదటివారంలో ఈ భారీ క్రేజీ ప్రాజెక్ట్‌కు ఇటు టాలీవుడ్ లేదా అటు బాలీవుడ్ అగ్ర హీరోల నుంచి పెద్దగా పోటీ ఉండే అవకాశం లేదని విశ్లేషిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న సోషియో–ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' విడుదల తేదీ ఇంకా అధికారికంగా ఖరారు కాలేదు. అయితే ఈ చిత్రాన్ని డిసెంబర్ చివరి వారంలో విడుదల చేసి, క్రిస్మస్ సెలవుల నుండి సంక్రాంతి వరకు వచ్చే లాంగ్ రన్‌ను క్యాష్ చేసుకోవాలని నిర్మాతలు భావిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అందువల్ల డిసెంబర్ మొదట్లో వచ్చే ప్రభాస్ సినిమాకు చిరు నుండి బాక్సాఫీస్ వద్ద ఎలాంటి పోటీ ఉండకపోవచ్చు. ాశ్రీంశీ =ముఃు – సెట్స్ లో రూల్స్ అందరికీ ఒకేలా! మరోవైపు బాలీవుడ్ మెగాస్టార్ షారూఖ్ ఖాన్ నటిస్తున్న హై–వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ –కింగ్– కూడా డిసెంబర్ రేసులో ఉన్నా.. డిసెంబర్ 24న అంటే మంత్ ఎండ్ లో రిలీజ్ కానుంది. 'పఠాన్' ఫేమ్ సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో షారూఖ్‌తో పాటు.. అతడి కుమార్తె సుహానా ఖాన్ డెబ్యూ చేస్తుండటం, దీపికా పదుకోన్, అభిషేక్ బచ్చన్ కీలక పాత్రల్లో నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై నార్త్ బెల్ట్‌లో భారీ హైప్ ఉంది. కానీ ఈ సినిమా డిసెంబర్ చివరలో వస్తుండటంతో అంతకంటే మూడు వారాల ముందే డిసెంబర్ 3న వచ్చే –ఫౌజీ– చిత్రానికి బాక్సాఫీస్ పరంగా ఎలాంటి చిక్కులు ఉండవు. ఆ సమయానికే ప్రభాస్ చిత్రం మెజారిటీ వసూళ్లను రాబట్టే అవకాశం ఉంది.వీటితో పాటు డిసెంబర్ నెలలో మరికొన్ని క్రేజీ ప్రాజెక్టులు థియేటర్లలోకి రాబోతున్నాయి. అమర్ కౌశిక్ దర్శకత్వంలో అలియా భట్, అనిల్ కపూర్, కార్తీక్ ఆర్యన్ ప్రధాన పాత్రల్లో వస్తున్న హారర్– కామెడీ చిత్రం 'చాముండ' డిసెంబర్ 4న విడుదల కానుంది. అయితే ఆలియా సినిమా ప్రభాస్ కి పోటీనిస్తుందని ఎవరూ భావించడం లేదు. అలాగే టాలీవుడ్ ట్యాలెంటెడ్ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న 'రౌడీ జనార్దన' కూడా డిసెంబర్ లోనే విడుదలకు సిద్ధమవుతున్నా.. ఈ సినిమా అధికారిక తేదీ ఇంకా ఖరారు కావాల్సి ఉంది. అయితే యానిమేషన్ ఫ్రాంచైజీలో వస్తున్న మైథలాజికల్ ఎపిక్ –మహావతార్– చిత్రం డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా రానుంది. దీని మొదటి భాగం విజయం కారణంగా సీక్వెల్ కి మంచి క్రేజ్ ఉండటం వల్ల యానిమేటెడ్ కేటగిరీలో ఈ చిత్రం ఒక్కటే 'ఫౌజీ' లాంగ్ రన్‌కు స్వల్ప పోటీని ఇచ్చే అవకాశం ఉంది టాలీవుడ్ నుంచి ప్రభాస్ –ఫౌజీ– చిత్రానికి పెద్ద కాంపిటీషన్ ఏదీ లేనట్టేనని స్పష్టమవుతోంది. ఆల్మోస్ట్ సోలోగానే బాక్సాఫీస్ బరిలోకి దిగుతున్న ప్రభాస్ డిసెంబర్ మొదటి రెండు వారాల పాటు థియేటర్లను రూల్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. బాలీవుడ్ – టాలీవుడ్ పెద్ద సినిమాలు డిసెంబర్ మూడో వారం లేదా చివరి వారంలో ప్లాన్ చేసుకోవడం వల్ల .. –ఫౌజీ–కి కలెక్షన్ల పరంగా భారీ అడ్వాంటేజ్ లభించనుంది. హను రాఘవపూడి లాంటి క్లాసిక్ డైరెక్టర్ ప్రభాస్ క్రేజ్‌ను ఉపయోగించుకుని బాక్సాఫీస్‌ను షేక్ చేయడానికి గ్రౌండ్ పక్కాగా సిద్ధమైంది. దర్శకుడు హను రాఘవపూడి ఈ చిత్రంలో ప్రభాస్‌ను సరికొత్త మేకోవర్‌లో.. ఒక పవర్‌ఫుల్ మిలిటరీ ఆఫీసర్‌గా ఆవిష్కరించబోతున్నారు. ఈ సినిమా కథాంశం బ్రిటీష్ కాలం నాటి బ్యాక్‌డ్రాప్‌లో.. మరీ ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధం నేపథ్యంలో నాటి ఒక చారిత్రాత్మక రొమాంటిక్ యాక్షన్ డ్రామా కథతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగనుందని సమాచారం. సైన్యంలో పనిచేసే ఒక సైనికుడి దేశభక్తి, అతడి జీవితంలో చోటుచేసుకున్న భావోద్వేగాల చుట్టూ ఈ కథ రక్తి కట్టించనుంది. హను రాఘవపూడి మార్క్ పోయెటిక్ లవ్ స్టోరీకి... ప్రభాస్ రేంజ్ యాక్షన్ ఎలివేషన్లను జోడించి ఈ విజువల్ వండర్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. కంటెంట్, భావోద్వేగాల పరంగా కనెక్టవుతుందని మొదటి రోజు సమీక్షలు, మౌత్ టాక్ స్ప్రెడ్ అయితే చాలు.. బాక్సాఫీస్ వద్ద పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మానియా ఎలా ఉంటుందో మరోసారి చూసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.




## ఓటీటీని టార్గెట్ చేసిన చైతన్య.. దూత2 వెనుక అసలు స్ట్రాటజీ ఇదేనా?

అందులో భాగంగానే ఆయన సూపర్ హిట్ వెబ్ సిరీస్ దూతకు సీక్వెల్‌గా తెరకెక్కుతున్న దూత2 ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.



అక్కినేని నాగ చైతన్య ప్రస్తుతం కెరీర్‌లో ఆసక్తికరమైన దశలో ఉన్నారు. ఒకవైపు భారీ స్థాయిలో తెరకెక్కుతున్న వృష కర్మ వంటి పాన్ ఇండియా ప్రాజెక్ట్‌తో థియేటర్లను టార్గెట్ చేస్తుండగా, మరోవైపు ఓటీటీ మార్కెట్‌పై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కనిపిస్తోంది. అందులో భాగంగానే ఆయన సూపర్ హిట్ వెబ్ సిరీస్ దూతకు సీక్వెల్‌గా తెరకెక్కుతున్న దూత2 ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. రీసెంట్ గానే ఈ సిరీస్ రెండో సీజన్ పనులు ప్రారంభమైన నేపథ్యంలో పలు ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రముఖ నటి భూమిక కీలక పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం సిరీస్‌పై మరింత ఆసక్తిని పెంచుతోంది. గతంలో సవ్యసాచి సినిమాలో నాగ చైతన్యతో కలిసి నటించిన భూమిక, ఇప్పుడు మరోసారి ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోనున్నారని టాక్ వినిపిస్తోంది. దూత తొలి సీజన్ ఓటీటీ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రింట్ మీడియా నేపథ్యాన్ని హారర్ థ్రిల్లర్ అంశాలతో మేళవించి డైరెక్టర్ విక్రమ్ కె కుమార్ రూపొందించిన కథనం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ముఖ్యంగా ప్రతి ఎపిసోడ్‌లో ఉత్కంఠను కొనసాగిస్తూ చివరి వరకు ఆసక్తిని నిలబెట్టిన విధానం ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు రెండో సీజన్‌లో మాత్రం పూర్తిగా కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి విక్రమ్ సిద్ధమవుతున్నారని సమాచారం. మొదటి సీజన్‌కు భిన్నమైన కథా ప్రపంచం, కొత్త మిస్టరీ ఎలిమెంట్స్, మరింత డార్క్ టోన్‌తో దూత2 రూపొందనున్నట్లు తెలుస్తోంది. అందుకే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. మరోవైపు నాగ చైతన్య– విక్రమ్ కె కుమార్ కాంబినేషన్ కూడా ఈ సిరీస్‌కు ప్రధాన ఆకర్షణగా మారుతోంది. వీరిద్దరి కాంబినేషన్ లో వచ్చిన థాంక్యూ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా, దూత వెబ్ సిరీస్ మాత్రం ఈ ఇద్దరి కాంబోకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. ముఖ్యంగా చైతన్యను కొత్త తరహా పాత్రలో చూపించిన విధానం ప్రేక్షకులను ఆకట్టుకుంది. దీంతో ఇప్పుడు ఈ కాంబినేషన్ మరోసారి కలిసి పనిచేస్తుండటంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. అంతేకాదు, దూత2 నాగ చైతన్యకు నటుడిగానే కాకుండా నిర్మాతగానూ ప్రత్యేకమైన ప్రాజెక్ట్ కావడం విశేషం. తన కెరీర్‌లో తొలి నిర్మాణ ప్రయత్నాన్ని ఓ వెబ్ సిరీస్‌తో ప్రారంభించడం ద్వారా ఓటీటీ రంగంలో కూడా తన స్థాయిని మరింత బలోపేతం చేసుకోవాలని చైతన్య భావిస్తున్నట్లు తెలుస్తోంది. థియేటర్లలో వృష కర్మతో, ఓటీటీలో దూత2తో రెండు వేర్వేరు మార్కెట్లను టార్గెట్ చేస్తూ ఆయన ముందుకు సాగుతున్న తీరు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. సరైన కథలు, సరైన ప్లాట్‌ఫామ్‌ల ఎంపికతో నాగ చైతన్య తన కెరీర్‌ను నెక్ట్స్ లెవెల్ కు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.